క్లుప్తంగా

ఖరీఫ్‌కు వరి విత్తనాలు సిద్ధం



విజయవాడరూరల్: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి బీ రంగనాథ్‌బాబు మంగళవారం తెలిపారు. బీపీటీ 5204, ఎంటీయూ 1061, ఎంటీయూ 1318 రకాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఒక్కో రైతుకు ఎకరానికి 30 కిలోల బస్తాను విక్రయించడం జరుగుతుందని తెలిపారు. 25 కిలోల బీపీటీ-5204 బస్తా రూ. 950, 30 కిలోల ఎంటీయూ-1318, ఎంటీయూ-1061 బస్తా రూ.1,150లు చొప్పున ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



పెనమలూరు: పోరంకి గ్రామంలోని లక్ష్మీపురం కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆలయంలో 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి జరగనున్నాయి. ఈనెల 4 నుంచి 9వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈ నెల 7వ తేదీన రాత్రి ఏడు గంటలకు శ్రీశ్రీశ్రీ త్రిదిండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో శ్రీవారి తిరుక్కల్యాణ మహోత్సవం చేయనున్నారు. 8న ఉదయం 11 గంటలకు అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

సంగీత సాధనతో ఏకాగ్రత పెరుగుతుంది



గన్నవరం: సంగీత సాధన ద్వారా పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని కాసా సంస్థ మాజీ రీజినల్ కోఆర్డినేటర్ పీఎస్ వరప్రసాద్ తెలిపారు. స్థానిక కే - మ్యూజికల్స్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి సంగీత శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వరప్రసాద్ మాట్లాడుతూ.. చిన్న వయస్సు నుంచి పిల్లలను సంగీత సాధన చేసే విధంగా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. తద్వారా పిల్లల్లో క్రమశిక్షణ, శ్రద్ధ, గురువులపై గౌరవం అలవాడతాయని తెలిపారు. విద్యార్థులను సంగీత కళాకారులుగా తీర్చిదిద్దుతున్న నిర్వాహకులను బెరాకా మినిస్ట్రీస్ డైరెక్టర్ టీ దాసుబాబు అభినందించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అతిథులు చేతుల మీదుగా సర్టిఫికెట్లును పంపిణీ చేశారు. రిథమ్స్ మాస్టర్ సీహెచ్ కార్తీక్, కే - మ్యూజికల్స్ డైరెక్టర్, కీబోర్డ్ మాస్టర్ పీఏ కిరణ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో ఎంపీ పాకా



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామివారిని బీజేపీ ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ మంగళవారం దర్శించుకున్నారు. ఇటీవలే రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఆయన ప్రమాణ స్వీకారం అనంతరం గన్నవరం విమానాశ్రయం నుంచి భీమవరం వెళుతూ మార్గమధ్యంలో ఇక్కడ కొద్దిసేపు ఆగారు. ఆలయం వద్ద పాకా వెంకట సత్యనారాయణకు అర్చకులు వేదమంత్రోర్చణల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారి శేష వస్త్రాలు, చిత్రపటం, ప్రసాదాలను ఆలయ అధికారులు, అర్చకులు అందించారు.

140 మందికి వైద్య పరీక్షలు

కంకిపాడు: విజయవాడ ఎంజీ నాయుడు హాస్పిటల్స్ సౌజన్యంతో కంకిపాడు ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ శివరామకృష్ణ రోగుల ఎముకలు, కీళ్ల సమస్యలపై పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. 140 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో బాబా మెడికల్ శ్రీనివాస్, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణమ్మ గర్భంలో పచ్చగద్దలు

- చోడవరం క్వారీలో పొక్లెయినర్‌తో ఇసుక తవ్వకాలు
- బుసక సైతం వదలని పచ్చనేతలు
- టన్నుల కొద్దీ ఇసుక అక్రమ రవాణా



చోడవరం వద్ద ఇసుక స్టాకు



నదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్న దృశ్యం

పెనమలూరు: మండలంలోని చోడవరం గ్రామంలో పచ్చగద్దలు రెచ్చిపోతున్నారు. కృష్ణవేణమ్మ నదీ గర్భంలో పొక్లెయినర్‌లతో భారీగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. నది ఒడ్డున టన్నుల కొద్దీ ఇసుక గుట్టల స్టాకు పెట్టారు. బుసక సైతం వదలక తవ్వకాలు చేసి వాహనాల్లో తరలిస్తున్నారు. నది అంచు వరకు బుసక తవ్వకాలు చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉచిత ఇసుక పేరుతో ఇక్కడ భారీ దోపిడి జరుగుతోంది. అయితే ఇక్కడ ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం నిమ్మక నీరెత్తినట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉచిత ఇసుక పేరుతో దోపిడీ

చోడవరం క్వారీలో పచ్చనేతలు పైస్థాయిలో పరపతి ఉపయోగించి అనుమతులు వచ్చాయని హడావుడిగా నదిలో వాలిపోయారు. గ్రామ సభలో గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం చెప్పినా కూటమి ప్రభుత్వం వారి మాటలు లెక్క చేయలేదు. గతంలో సుప్రీం కోర్టు సర్వే నెంబర్-1లో తవ్వకాలు నిషేధించిన అదే ప్రాంతంలో పొక్లెయినర్లతో ఇసుక తవ్వకాలు చేపట్టారు. ఏడు హెక్టార్లలోపే ఇసుక తవ్వకాలు చేయాల్సి ఉండగా, ఇప్పుడు నదిలో ఎక్కడ పడితే అక్కడ ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. టన్నుల కొద్దీ ఇసుక తవ్వి నది ఒడ్డున భారీగా నిల్వలు ఉంచారు. అలాగే టిప్పర్లతో అనేక టన్నుల ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారు. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అధికారుల సమక్షంలోనే బేఖాతర్ చేస్తున్నారు.

మాఫియా చేతుల్లో చోడవరం

ఇసుక మాఫీయా నది అంచున రైతు పొలాల వద్ద, లంక భూముల సమీపంలో బుసక, మట్టి తవ్వకాలు చేపట్టారు. దీనిపై గ్రామ పంచాయతీ పాలకులు, గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతూ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. ఇప్పటికీ ఇసుక బుసు తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. నదిలో ఇసుక తవ్వకాలు అత్యంత ప్రమాదస్థితిలో తవ్వడంతో చోడవరం గ్రామం పచ్చగద్దల మాఫియా చేతుల్లో చిక్కుకుపోయింది.

ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

పెదపులిపాక ఇసుక క్వారీ హైకోర్టు స్టేలో ఉంది. ఇక్కడ ఇసుక తవ్వకాలు చేయరాదని నిషేధం అమలులో ఉంది. ఇక్కడ కూడా పచ్చనేతలు క్వారీపై పంజా విసిరారు. అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చట్ట విరుద్ధంగా చేస్తున్నారు. దీనిపై అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదు. దీనిపై గ్రామస్తులు అభ్యంతరం తెలుపుతున్నారు. కోర్టు స్టే ఉండగా ఇసుక తవ్వకాలు ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇసుక తవ్వకాలు కోర్టు ధిక్కారం కింద వస్తుందని గ్రామస్తులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. అయినా కూడా తవ్వకాలు ఆగలేదు.



నదిలో పంట భూముల వద్ద తవ్విన మట్టి, బుసక

ఓవర్ లోడ్‌తో రవాణా

ఇసుక అక్రమ రవాణా కారణంగా చోడవరం, పెదపులిపాక, యనమలకుదురు, వణుకూరు, పెనమలూరు, తాడిగడప గ్రామస్తులు చాలా ప్రమాద పరిస్థితిలో ఉన్నారు. ఇసుక వాహనాలు ఓవర్ లోడ్‌తో ఆయా గ్రామాల మీదుగా రవాణా సాగిస్తుండటం వల్ల రోడ్లపై ఇసుక ఎక్కడపడితే అక్కడ పడి ఉంది. దీంతో ద్విచక్రవాహనదారులు రోడ్లపై వెళుతున్న సమయంలో ఇసుక కారణంగా ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా కూడా ప్రమాదాలు నివారించడానికి రోడ్లపై పడిన ఇసుకను తొలగించడం లేదు.

క్వారీపై కోర్టు అభ్యంతరం

చోడవరం ఇసుక క్వారీలో గత కొద్ది రోజులుగా అనుమతులు వచ్చాయని నిబంధనలకు విరుద్ధంగా పొక్లెయినర్‌తో తవ్వకాలు చేపట్టారు. వాస్తవానికి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు 2024లో జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి(డీఎంజీవో) చోడవరం క్వారీలో సర్వే నెంబర్ - 1లో జాయింట్ తనిఖీల్లో అప్పటి కాంట్రాక్టర్ ఇసుక అక్రమ తవ్వకాలు చేశారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కాగా కూటమి ప్రభుత్వం మరల చోడవరం ఇసుక క్వారీ తెరవాలని గ్రామంలో ఫిబ్రవరి 10వ తేదీన నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు ఏక కంఠంతో క్వారీ వద్దని తేల్చిచెప్పి గొడవ చేశారు. అయితే అధికారుల తప్పుడు నివేదికలతో చోడవరం ఇసుక క్వారీలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు.

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి

గన్నవరం: కూటమి ప్రభుత్వం మోసపూరిత వాగ్దానాలను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు బుధవారం తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు జయప్రదం చేయాలని ఆ పార్టీ నాలుగు మండలాల అధ్యక్షుడు శీలం రంగారావు, నీలం ప్రవీణ్‌కుమార్, వింత శంకరరెడ్డి, నక్క గాంధీ మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో కోరారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ శ్రేణులు బుధవారం ఉదయం 8.30 గంటలకు గన్నవరంలోని బుద్దవరం రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. అక్కడి నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి పేర్ని నాని నేతృత్వంలో శాంతియుత ప్రదర్శనగా స్థానిక తహసీల్దారు కార్యాలయానికి చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలకు చేసిన నయవంచనపై వినతిపత్రం సమర్పించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ అభిమానులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని నూతన యాగశాలలో విఘ్నేశ్వర పూజ, రుత్విక్ వరుణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, క్షీరాధివాసాలను ఆలయ అర్చకులు జరిపించారు. తొలుత విఘ్నేశ్వర పూజను ఆలయ వైదిక కమిటీ పర్యవేక్షణలో నిర్వహించగా, ఆలయ ఈఓ శీనానాయక్ పాల్గొన్నారు. సాయంత్రం మండప పూజలు, మూల మంత్ర హవనం, అధివాసాలు జరిగాయి. పూజా కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు లింగంభోట్ల దుర్గాప్రసాద్, మల్లేశ్వర శాస్త్రి, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలతో ప్రగతి సాధ్యం



దావులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కిశోర బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది



వణుకూరులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీలత

పెనమలూరు: నాయకత్వ లక్షణాలతో ప్రగతి సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే శ్రీలత పేర్కొన్నారు. వణుకూరు గ్రామంలో మంగళవారం కిశోరి వికాసం, వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు జీవిత నైపుణ్యాలను, సాధికారిత లక్ష్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. మహిళా సంరక్షణ కార్యదర్శి డీ వికల్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కానూరులో..

కానూరులో జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం

కంకిపాడు: ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి అన్నారు. దావులూరు పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ సెంటరు పరిధిలో మంగళవారం కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కిశోర బాలలతో కలిసి ర్యాలీ చేపట్టారు. సూపర్‌వైజర్ అన్నామణి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ఎం.సంఘమైత్రి, హబీబున్నీసా, అంగన్‌వాడీ టీచర్లు పుష్పజ్యోతి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై పట్టు సాధించాలి



వణుకూరులో యోగా చేస్తున్న చిన్నారులు



కంకిపాడులో తాము గీసిన చిత్రాలు చూపుతున్న విద్యార్థులు

కంకిపాడు: చిత్రలేఖనంపై పట్టు సాధించాలని వక్తలు సూచించారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా కంకిపాడు శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ నిర్వహించారు. గడ్డం దీపిక చిన్నారులకు అవసరమైన శిక్షణ ఇచ్చారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు. అలాగే తెన్నేరు శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు క్యారమ్స్, చెస్, కుట్లు, అల్లికలపై శిక్షణ ఇచ్చారు. మల్లేష్‌రావు చిత్రలేఖనంలో మెళుకువలు నేర్పించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

యోగాతోనే ఆరోగ్యం

పెనమలూరు: యోగా చేయడంతోనే ఆరోగ్య చేకూరుతుందని వణుకూరు శాఖ గ్రంథాలయం అధికారి భారతి అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం గ్రంథాలయంలో చిన్నారులతో యోగా చేయించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవంలో చిన్నారులు పాల్గొనాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించి ఆటపాటలు నిర్వహించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో మంగళవారం విద్యార్థులకు పలు నీతికథల పుస్తకాలను పరిచయం చేశారు. నీతికథలు చదవడం వల్ల వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు అలవర్చుకోవచ్చని గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి విద్యార్థులకు వివరించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అనంతరం సామాన్యశాస్త్రంలో రక్తనాళాలు, వాటి నిర్మాణం పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించారు. పలు ఇండోర్ గేమ్స్, నృత్య శిక్షణ నిర్వహించారు.

నేటి నుంచి పునీత ఆంథోని మహోత్సవాలు

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో ఉన్న ఆర్సీఎం దేవాలయంలో ఈ నెల నాలుగు నుంచి 13వ తేదీ వరకు పునీత ఆంథోని వారి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు విచారణ కర్తలు రెవ. ఫాదర్ నూతనపాటి కిషోర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సంఘ పెద్దలతో కలిసి ఆయన మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ విజయవాడ మైత్రాసనం సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ రెవ. ఫాదర్ తోట సునీల్ నేతృత్వంలో బుధవారం నవదిన ప్రార్థనలతో మహోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి జపమాల, దివ్యబలిపూజ, పునీత ఆంథోని ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10, 11 తేదీల్లో పాస్టరల్ డైరెక్టర్ రెవ. ఫాదర్ బావను విజయరాజు ఆధ్వర్యంలో సువార్త స్వస్థతా ప్రార్థనలు జరుగుతాయని చెప్పారు. 13న జరిగే ముగింపు వేడుకల్లో మైత్రాసనం పీఠాధిపతులు తెలగతోటి రాజారావు పాల్గొని దివ్యబలిపూజ సమర్పించనున్నట్లు తెలిపారు. అదేరోజు భక్తులకు అన్నసంతర్పణ, సాయంత్రం పునీత ఆంథోని వారి తేరు ప్రదక్షిణ జరుగుతుందని పేర్కొన్నారు.

అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దాతలు గంగుల ప్రదీప్ కుమార్, కవిత దంపతులు(ఏలూరు) సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాలిక కిడ్నాప్ కేసులో ఎవరిని వేధించలేదు

గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు



పెనమలూరు పీఎస్‌లో విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పెనమలూరు: పోరంకిలో కిడ్నాప్‌నకు గురైన బాలిక కేసును పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని, పోలీసులు ఈ ఘటనలో ఎవరిని వేధించలేదని గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 28వ తేదీన పోరంకిలో మైనర్ బాలికను చందు అనే యువకుడు కిడ్నాప్ చేశాడన్నారు. బాలికను శ్రీకాకుళం టౌన్‌లోని అతని తల్లిదండ్రుల వద్దకు తీసుకువెళ్లాడని చెప్పారు. చందు తల్లి రేణుక బాలిక వద్ద బంగారు తీసుకొని తాకట్టు పెట్టింది. పైగా మే 4, 5 తేదీల్లో రాజాంలోని లాడ్జిలో తల్లి సహకారంతో చందు, మైనర్ బాలిక ఉన్నట్లు తమ దర్యాప్తులో గుర్తించామన్నారు. దీని సీసీ పుటేజీ కూడా తమ వద్ద ఉందని తెలిపారు. తల్లి వద్ద కొంత బంగారు రికవరీ చేశామని అన్నారు. అయితే రేణుక తన భర్త మోహన్‌రావుకు తెలియకుండా ఈ పనులు చేసినందుకే అతను మనస్థాపంతో గత నెల 22వ తేదీన పురుగు మందు తాగి మృతిచెందాడని తెలిపారు. అయితే రేణుక వాస్తవాలను కప్పి పుచ్చి పోలీసులపై ఆరోపణలు చేసిందని పేర్కొన్నారు.

వేగంగా విచారణ

బాలికను కిడ్నాప్ చేయడంతో కేసు విచారణ వేగంగా చేస్తున్నామని, అయితే ఇప్పటివరకు బాలిక ఆచూకీ తెలియలేదని చెప్పారు. బాలికను క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో సీఐ జె.వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: ఉంగుటూరు మండలం నందమూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందమూరు, చికినాల, బొకినాల, ఇందుపల్లి, మదిరిపాడు, చాగంటిపాడు, వేంపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెనమలూరు: పోరంకిలో 11కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా గ్రామంలోని బీజేఆర్ నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మి నగర్, వసంతనగర్, విష్ణుపురంకాలనీ, సాయినగర్, లక్ష్మీపురం కాలనీ, బ్రహ్మంగారి గుడి, గద్దె ఆర్టీసీ కాలనీ, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆత్కూరులో..

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు ఆత్కూరు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలోని విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించవలసిందిగా ఆయన కోరారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం బుధవారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. నూజివీడు రోడ్డు, మహాత్మగాంధీ నగర్, కృష్ణానగర్, రైల్వే స్టేషన్ ఏరియా, తారకరామ కాలనీ, ఐటీఐ రోడ్డు, నెహ్రూ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు

సాక్షి స్పందన



ధ్వంసమైన విద్యుత్ స్తంభం స్థానంలో ఏర్పాటు చేసిన నూతన స్తంభం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు కొమ్మారాము వీధిలో విద్యుత్ స్తంభం తీగలపై ఒరిగిపోయి ప్రమాదకరంగా మారిన విషయాన్ని ఈనెల 2న సాక్షిలో 'ఒరిగిన విద్యుత్ స్తంభానికి నిచ్చెనే దిక్కు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ధ్వంసమై ఒరిగిపోయిన స్తంభాన్ని తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. గత రెండు రోజుల క్రితం గుర్తు తెలియని వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో ఒక పక్కకు ఒరిగిపోయింది. ఈ ప్రాంతంలో విద్యుత్ సరాఫరా అయ్యే విద్యుత్ తీగలపై ఈ స్తంభం పడటంతో ప్రమాదకరంగా మారిన విషయాన్ని సాక్షి కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు ధ్వంసమైన స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు.

నగరంలో 'భైరవం' చిత్ర యూనిట్ సందడి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో భైరవం చిత్ర యూనిట్ సందడి చేసింది. శ్రీ సత్యసాయి ఆర్ట్ బ్యానర్‌పై నిర్మించిన భైరవం చిత్ర విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం గాంధీనగర్‌లోని అలంకార్ థియేటర్‌కు చిత్ర యూనిట్ సభ్యులు చేరుకున్నారు. విజయాలవాడ బెజవాడ అంటూ ఎన్నో ఏళ్ల తర్వాత మళ్లీ మీముందుకొచ్చా! అందరూ బాగున్నారా..! అనే డైలాగుతో భైరవం నటుడు హీరో మంచు మనోజ్ సందడి చేసి అభిమానులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మట్లాడుతూ... ఇక ఆగేది లేదు. మన సినిమాలు వస్తూనే ఉంటాయన్నారు. డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం రెండు వారాల్లో విడుదల కానున్నదని, అప్పటివరకు హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో భైరవం చిత్రం ఆడుతూనే ఉండాలని ఆకాంక్షించారు. మరో నటుడు నారా రోహిత్ మాట్లాడుతూ తాను నటించిన సుందరాకాండ జూలైలో రిలీజ్ కానున్నదని, దానిని కూడా ఇలాగే విజయవంతం చేయాలని కోరారు. చిత్ర దర్శకుడు కనకమేడల విజయ్ మాట్లాడుతూ ఈ చిత్రం కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమని తెలిపారు. అనంతరం చిత్ర నిర్మాత కె.కె.రాధామోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో అన్నపూర్ణ స్టూడియోస్ మేనేజర్ కుమార్ పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): విడాకులు తీసుకున్న మొదటి భర్త వేధింపులకు గురి చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రాధానగర్‌కు చెందిన తాడిశెట్టి శ్రీనాగలక్ష్మి మొదటి భర్త దొండగల పాండురంగారావు నుంచి 2014వ సంవత్సరంలో విడాకులు తీసుకుని, 2015లో తాడిశెట్టి బాబూరావును రెండవ వివాహం చేసుకుంది. 2019లో బాబూరావు మరణించాడు. ఆ విషయం తెలుసుకున్న మొదటి భర్త దొండగల పాండురంగారావు తనను, తన పిల్లల్ని ఫోన్ చేసి అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నట్లు నాగలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బహుభాషా గాయకుడు ఎస్పీబీకి ఘన నివాళి

విజయవాడకల్చరల్: బహుభాషా గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని సీనియర్ పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు అన్నారు. డ్రీమ్ ఆడియో ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై మంగళవారం సినీ నటుడు, నిర్మాత, సంగీత దర్శకుడు గాయకుడు బాల సుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను నిర్వహించారు. డేవిడ్‌రాజు మాట్లాడుతూ బాలు 50 వేలకుపైగా అనేక భాషల్లో పాటలు పాడి అలరించారన్నారు. వివిధ సంస్థలకు చెందిన పరుచూరి విజయలక్ష్మి, తొట్టెంపూడి రమేష్, చావా నరసింహారావు, చింతకాయల చిట్టిబాబు, వీరభద్రరావు, ఏవీ రమణ పాల్గొన్నారు.